సాక్షి సూర్యాపేట

గురువారం । 16 । అక్టోబర్ । 2025



జలహొయలు

మఠ్రిగూడ మండలం అజ్జిలాపురం వద్ద ఉన్న బుగ్గ జలపాతం వర్షాకాలంలో కనువిందు చేస్తోంది

- 10లో



సినిమా షూటింగ్

భూదాన్‌పోచంపల్లి మండలం శివారెడ్డి గూడెంలో 'కృష్ణ ఫ్రమ్ బృందావనం కాలనీ' సినిమా షూటింగ్ నిర్వహించారు.

- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**589.70** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**66,868** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**66,868** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**33,089** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**10,040** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**6,401** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**1,200** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

గురుకులాల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు

నడిగూడెం : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్.పద్మ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. 5 నుంచి 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. గురుకుల ఎరెస్సెటిస్ట్ రాసిన విద్యార్థుల్లో ఆసక్తి ఉన్న వారు ఈ నెల 16, 17 తేదీల్లో సూర్యాపేట మండలం ఇమామ్‌పేట గురుకుల పాఠశాలలో దరఖాస్తులు అందించాలని కోరారు. దరఖాస్తుతో పాటు, కుల ధృవీకరణ పత్రం, ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్ జిరాక్స్ జతపర్చాలని సూచించారు.

కలాం ఆశయ సాధనకు కృషి చేయాలి



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు అన్నారు. అబ్దుల్ కలాం 94వ జయంతిని బుధవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తిరుమలగిరిలోని పెన్షనర్స్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు సంకెపల్లి విశల్‌రెడ్డి, ఎం.పద్మారెడ్డి, బన్వరి నర్సయ్య, సీహెచ్.పుల్లయ్య, మల్లయ్య, సత్తిరెడ్డి, కొమురెల్లి, రాములు, రాంరెడ్డి, కృష్ణమాచారి, విద్యాసాగర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇవ్వాలి



చిలుకూరు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్

చిలుకూరు: ప్రభుత్వ వైద్యశాలల్లో సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నారాయణపురం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయ మనోరి, డాక్టర్ సుభాశ్, సిబ్బంది ఉన్నారు.

బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి



నామినీలకు బీమా చెక్కును అందిస్తున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్

తుంగతుర్తి : కేంద్ర ప్రభుత్వం జాతీయ బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట నాగప్రసాద్ కోరారు. మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్‌లో పలువురు ఖాతాదారుల నామినీలకు మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కులను బుధవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల్లో ఖాతా కలిగిన వారు సంవత్సరానికి రూ.436 ప్రీమియం చెల్లిస్తే వారికి బీమా వర్తిస్తుందన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకానికి 18 నుంచి 50 సంవత్సరాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులని తెలిపారు. బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న పేదలు ఈ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ వెంగళరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీకి ఆరుగురి పేర్లు!

అధ్యక్షుడి ఎంపికకు కాంగ్రెస్‌పార్టీ కసరత్తు

- జిల్లాలో ఏఐసీసీ పరిశీలకుడి మకాం
- కార్యకర్తలతో వరుస మీటింగ్‌లు, అభిప్రాయాల సేకరణ
- ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



భానుపురి (సూర్యాపేట) : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపికకు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఇందుకు గానూ ఏఐసీసీ పరిశీలకుడు ఈ నెల 13 నుంచి జిల్లాలో మకాం వేశారు. ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తూ.. నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తూ కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. పార్టీకి విధేయులుగా ఉంటూ కార్యకర్తల కోసం పనిచేస్తూ, ప్రజల్లో మంచి పేరున్న నాయకుడిని అధ్యక్షుడిగా ఎంపిక చేయనున్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని జిల్లా నుంచి ఆరుగురి పేర్లను ఏఐసీసీకి పంపనున్నారు.

గతానికంటే భిన్నంగా

గతంలో కాంగ్రెస్ అధిష్టానానికి సన్నిహితంగా, ముఖ్య నాయకులతో సఖ్యతగా ఉన్న నాయకులనే డీసీసీ అధ్యక్షులుగా ఎంపిక చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీలో సంస్కరణలకు రాహుల్‌గాంధీ పిలుపు నివ్వడంతో ప్రస్తుతం క్షేత్ర స్థాయి నుంచి ప్రజాస్వామ్య పద్ధతిలో అధ్యక్షుడిని ఎంపిక చేస్తున్నారు. గుజరాత్ రాష్ట్రంలో ఈ విధానం సక్సెస్ కావడంతో అన్నిరాష్ట్రాల్లోనూ ఇదే విధంగా ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. దాంతో పాటు కార్యకర్తల అభిప్రాయాలను సైతం తెలుసుకుంటోంది.

అధ్యక్ష స్థానం కోసం తీవ్ర పోటీ

ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో డీసీసీ అధ్యక్ష పదవి కోసం నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. డీసీసీ అధ్యక్షుడి నియామకం కోసం పార్టీ దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో పెద్ద ఎత్తున నాయకులు దరఖాస్తు చేసుకుంటున్నారు. అధ్యక్ష పదవి తమకు ఇవ్వాలని ఏఐసీసీ పరిశీలకుడికి వినతిపత్రాలు సైతం అందించారు. తమ రాజకీయ గురువులను కలిసి ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.ఈ పోటీ నడుమ డీసీసీ పదవి ఎవరిని వరిస్తుందోనని కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

ఎవరికి దక్కుతుందో..?

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా 2018లో మొదటిసారిగా చెవిటి వెంకన్నయాదవ్‌ను నియమించారు. ప్రతిపక్షంలో ఉండి పార్టీపరంగా ప్రతి కార్యక్రమాన్ని ఆయన జిల్లాలో విజయవంతం చేశారు. దాంతో 2023 మేలో రెండోసారి ఆయననే డీసీసీ అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఆనాటి నుంచి ఆయనే కొనసాగుతున్నారు. జిల్లాలో బలమైన బీసీ నేత కావడం, అందరినీ కలుపుకొని పోయే వ్యక్తి కావడంతో మరోసారి అవకాశం ఉంటుందన్న చర్చ ఉంది. అయితే ప్రస్తుత డీసీసీని కొనసాగించే అవకాశం లేదని, ఎమ్మెల్యేలు, ఎంపీల బంధువులకు సైతం పదవులు ఇచ్చేది లేదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆదేశించినట్లు తెలుస్తోంది. దాంతో డీసీసీ అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందోనన్న చర్చ పార్టీ నాయకుల్లో సాగుతోంది.

వరుస సమావేశాలు

కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకుడు సారత్ రౌత్ నాయకులు, కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ వారి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఆయన పర్యటించారు. బుధవారం కోదాడలో పర్యటించి కోదాడ హుజూర్‌నగర్ కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు.

పార్టీకోసం పనిచేసేవారికి తగిన గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు సారత్ రౌత్, చిత్రంలో మంత్రి ఉత్తమ్

- ఏఐసీసీ పరిశీలకుడు సారత్ రౌత్

కోదాడ: పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు ఇస్తామని ఏఐసీసీ పరిశీలకుడు సారత్ రౌత్ అన్నారు. బుధవారం కోదాడలోని కాశీనాథం ఫంక్షన్‌హాల్లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సంగతన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కిందిస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తల అభిప్రాయం మేరకే పార్టీ పదవులు భర్తీ చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుల ఎన్నికలో కార్యకర్తల, నాయకుల అభిప్రాయాలను తెలుసుకోవడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి, కష్టపడే వారికి తగిన గుర్తింపు ఇవ్వడానికే అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన ముఖ్యనాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి, చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, నాయకులు సాముల శివారెడ్డి, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25న మెగా జాబ్‌మేళా

- 150 కంపెనీలు.. 5 వేల మందికి ఉద్యోగాలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ: హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలకు చెందిన యువతీ, యువకుల కోసం ఈ నెల 25న హుజూర్‌నగర్‌లోని విజ్ఞాన్ స్కూల్లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం కోదాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాబ్ మేళాకు 150 కంపెనీలు వస్తున్నాయని, 5 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. దీనిపై గ్రామీణ స్థాయిలో కూడా నాయకులు విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. జాబ్ మేళాకు వచ్చే వారి కోసం టిఫిన్, భోజన ఏర్పాట్లు కూడా ఉంటాయన్నారు. మేళాకు వచ్చే వారు ఐదు సెట్ల బయోడేటాన, రెండు ఫొటోలను వెంట తీసుకొని రావాలని కోరారు. 10వ తరగతి నుంచి పీజీ, డిప్లొమా, ఇంజినీరింగ్, ఫార్మసీ వరకు చదివిన విద్యార్థులు హాజరు కావచ్చని సూచించారు.

ఆర్డీఆర్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

తుంగతుర్తి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి చిత్రపటానికి ఎంపీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు సర్వోత్తంరెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని, ఎన్ని కష్టాలు వచ్చినా ఆయన పార్టీని వీడలేదని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు తీగల గిరిధర్‌రెడ్డి, ఎల్సోజు చామంతినరేశ్, పలు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, గుడిపాటి నరసయ్య, అవిలమల్లు యాదవ్, నాయకులు తిరుమలప్రగడ కిషన్‌రావు, పచ్చిపాల సుమతి, దాయం ఝాన్సీరాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

- ఎస్పీ నరసింహ



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్/తిరుమలగిరి (తుంగతుర్తి) : విద్యార్థులు ఉన్నత ఆశయం, లక్ష్యాన్ని ఎంచుకొని, వాటి సాధనకు కష్టపడి చదువాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తిరుమలగిరి మున్సిపాల్టీ పరిధిలోని మోడల్ పాఠశాలలో విద్యార్థులకు శాంతి భద్రతలు, చట్టాలు, మంచి ప్రవర్తన, విద్యార్థి ఉన్నత లక్ష్యాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ మోసాలు, మాదకద్రవ్యాలు అతిపెద్ద సమస్యగా మారాయని, విద్యార్థులు వీటిపై పెద్దలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఇంటర్నెట్‌ను నాలెడ్జ్ కోసం మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు వెంకటయ్య, నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ప్రిన్సిపాల్స్ యాదయ్య, సంజీవ్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. మొదట ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. స్వామి అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణం జరిపించారు. స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నాగారం : పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని, గాలికుంటు వ్యాధి రాకుండా పశువులకు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ డి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని ఫణిగిరిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కలుషితమైన మేత, తాగునీరు, గాలి ద్వారా ఈ వ్యాధి ఇతర పశువులకు సంక్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.వెంకన్న, డాక్టర్ బి.రవిప్రసాద్, మండల పశువైద్యాధికారి బత్తుల రవి, పశువైద్యాధికారులు పి.మౌనిక ప్రియదర్శిని, ఏ.నరేశ్, జేవీఓ వై.నాగరాజు, ఎల్‌ఎస్‌ఏలు టి.మురళి, స్వప్న, రైతులు పాల్గొన్నారు.



ఫణిగిరిలో టీకాల పంపిణీని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌రావు

ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉన్నాం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అధికారులు

భానుపురి (సూర్యాపేట) : వానకాలం సీజన్ ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. ధాన్యం సేకరణపై బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సూర్యాపేట జిల్లాలో 4.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు అంచనా వేశామన్నారు. ఈ నెల నాలుగో వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని, దానిని దృష్టిలో ఉంచుకొని ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సామగ్రి, గన్నీ బ్యాగులు అందించినట్లు తెలిపారు. మిల్లుకు ఎంత ధాన్యం పంపించాలో ముందే ట్యాగింగ్ చేసినట్లు తెలిపారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌర పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాము, డీఆర్‌డీఓ అప్పారావు, డీసీఓ పద్మ, మున్సిపల్ కమిషనర్ హనుమంత్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ శర్మ, ట్రాన్స్‌పోర్ట్ అధికారి జయప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : మహిళల ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు తగిన శ్రద్ధ వహించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. పోషణ మాసంలో భాగంగా బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఫక్షన్‌హాల్లో నిర్వహించిన సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోషకాహారలోపం లేని సమాజాన్ని నిర్మించడమే పోషణ మాసం లక్ష్యమన్నారు. అందుకు కిందిస్థాయిలో కృషి చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లను అభినందించారు. గర్భిణుల పోషణలో ఆమె కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో కీలకమన్నారు. బాల్య ఆరంభ దశ సంరక్షణ, విద్యపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం




సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

చివ్వెంల: మొదటి నుంచి కూడా రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం సీనియర్ నాయకుడు ఇట్టమళ్ల ఏసోబ్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించలేదన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న రాజ్యాంగాన్ని మనువాద బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణకు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కేసీఆర్ అవలంబించిన విధానాన్నే రేవంత్ సర్కార్ అమలు చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు అమర వీరులు చూపిన బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ జీవితాంతం పేదల అభ్యున్నతికి కృషిచేసిన మహనేత ఇట్టమళ్ల ఏసోబ్ అన్నారు. అనంతరం ఇట్టమళ్ల ఏసోబ్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు విరాళంగా ఇచ్చిన స్థలంలో సీపీఎం కార్యాలయ నిర్మాణానికి తమ్మినేని శంకుస్థాపన చేశారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, వై.వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, సీపీఐ నాయకుడు ఖమ్మంపాటి అంతయ్య, ఇస్లావత్ రాంచందర్ నాయక్, ములకలపల్లి రాములు, పారేపల్లి శేఖర్‌రావు పాల్గొన్నారు.

ఆపదలో ప్రాణాలు నిలిపే సీపీఆర్

- అత్యవసరంలో అనుసరించాల్సిన విధానంపై అవగాహన
- జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్
- విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో శిక్షణ



సూర్యాపేటటౌన్ : ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ చేయడం వల్ల అతడి ప్రాణాలు కాపాడొచ్చు. సీపీఆర్ చేయడానికి వైద్యులే అవసరం లేదు, అవగాహన ఉన్న వారు చాలు. ఆగిన గుండెను తిరిగి పని చేయించే కార్డియో పల్మనరీ రిసస్కిటేషన్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం కోసం వైద్యారోగ్యశాఖ చర్యలు చేపట్టింది. ఐదురోజుల పాటు జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

అధికమైన గుండెపోటు సమస్య

ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా పిల్లల నుంచి వృద్ధుల వరకు గుండెపోటు సమస్యను ఎదుర్కొంటున్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం, రోజువారీగా తీసుకునే ఆహారంలో మార్పులు, జంక్ ఫుడ్, కొవ్వు పదార్థాలు అధికంగా తినడం వల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి రక్త సరఫరాకు అడ్డు పడడం వల్ల చాలా మంది గుండెపోటు బారిన పడుతున్నారు. ఒక్కోసారి తీవ్రమైన ఒత్తిడి వల్ల కూడా హార్ట్ అటాక్ వస్తున్నది.

వెంటనే సీపీఆర్ చేస్తే ప్రయోజనం

ఆరోగ్యంగా ఉన్న వ్యక్తికి కూడా ఒక్కోసారి సడెన్‌గా గుండె పనిచేయడం ఆగిపోతుంది. దానినే కార్డియాక్ అరెస్ట్ అంటారు. దాంతో వారు ఒక్కసారిగా ఉన్నచోటే కుప్పకూలిపోతారు. కొందరికి నొప్పి రాకుండానే గుండెపోటు వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో అవగాహన ఉన్న వారు వెంటనే స్పందించి సీపీఆర్ చేస్తే వారి గుండె తిరిగి పని చేయడం ప్రారంభిస్తుంది. దాంతో అతడి ప్రాణాలు నిలిపే అవకాశం ఉంటుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తి ఛాతిపై రెండు అరచేతులు ఒకదానిపై ఒకటి ఉంచి హృదయ స్పందన తిరిగి ప్రారంభమయ్యేలా నొక్కుతూ ఉండాలి. ఇలా చేయడం వల్ల అతను బతికే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నాం

ఈ నెల 13 నుంచి 17 వరకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన డాక్టర్లతో సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించనున్నాం. ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాలు, రద్దీ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన కల్పించేలా ఐదురోజుల స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. సీపీఆర్‌పై అవగాహన ఉంటే తోటి మనిషి ప్రాణాలు కాపాడే అవకాశ ఉంటుంది.

– డాక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ, సూర్యాపేట

విస్తృతంగా అవగాహన

సీపీఆర్‌పై జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాలు, మాల్స్, ఆస్పత్రులు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల 13 నుంచి ప్రారంభమైన అవగాహన కార్యక్రమాలు 17 వరకు కొనసాగనున్నాయి. వైద్యులు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, పీహెచ్‌సీల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

క్లుప్తంగా

రూపాయికి బీఎస్ఎన్ఎల్ సిమ్‌కార్డు

రామగిరి(నల్లగొండ): దీపావళి పండుగకు రూపాయికి బీఎస్ఎన్ఎల్ సిమ్‌కార్డు ఆఫర్ ప్రవేశపెట్టినట్లు ఆ సంస్థ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. దీపావళి ప్రత్యేక పథకం ద్వారా ఒక్క రూపాయి ప్రీపెయిడ్ సిమ్‌కార్డుతో నెల రోజుల పాటు అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, 100 ఎస్ఎమ్ఎస్‌లు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆఫర్ కొత్తగా ప్రీపెయిడ్ సిమ్ తీసుకునే వారికి, పోర్టబులిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌లోకి మారే వారికి వర్తిస్తుందని తెలిపారు.

మహిళ అదృశ్యం

భువనగిరి: మండలంలోని వడాయిగూడెం గ్రామంలో మహిళ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన బబ్బూరి శంకరయ్య బుధవారం ఉదయం 10.30 గంటలకు పని నిమిత్తం యాదగిరిగుట్టకు వెళ్లి తిరిగి వచ్చాడు. ఇంట్లో భార్య ఉమారాణి కనిపించకపోవడంతో చుట్టపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికాడు. ఎక్కడా కనిపించకపోవడంతో స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన భార్య మానసికస్థితి సరిగా లేక కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

జానకిపురంలో వ్యక్తి..

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల పరిధిలోని జానకిపురం గ్రామానికి చెందిన కట్కూరి లక్ష్మయ్య (86) ఈనెల 13న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈమేరకు ఆయన కుమారుడు సోమయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రికి మతిస్థిమితం సరిగా లేదని తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న గాలింపు



గాలింపు చర్యల్లో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

చందంపేట : నేరెడుగొమ్ము మండలం వైజాక్ కాలనీలోని కృష్ణా వెనుక జలాల్లో మంగళవారం యువకుడు గల్లంతు కాగా.. అతడి ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన తిన్నారపు పృథ్వీరాజ్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అత డు తన స్నేహితులతో కలిసి వైజాక్ కాలనీకి రాగా ఈత కోసం కృష్ణా వెనుక జలాల్లో దిగి గల్లంతయ్యాడు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పృథ్వీరాజ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రబాబు బుధవారం తెలిపారు.

జల హోయలు



అజ్జలాపురం బుగ్గ జలపాతం వద్ద పర్యాటకుల సందడి

- కనువిందు చేస్తున్న అజ్జలాపురం బుగ్గ జలపాతం
- అటవీ ప్రాంతమంతా మొగలి పూల సువాసన

మర్రిగూడ: 2500 ఎకరాల విస్తీర్ణంలో చుట్టూ ఉన్న కొండలు, వాటి మధ్య పరుచుకున్న పచ్చదనం ప్రకృతి ప్రేమికులను ఎంతో మైమరపింపజేస్తోంది. అక్కడే కొలువుదీరిన బుగ్గ శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తోంది. ఎత్తిపోతల పర్యాటక ప్రాంతంగా పేరుగాంచింది. మర్రిగూడ మండల పరిధిలోని అజ్జలాపురం బుగ్గ వద్ద జలపాతం వర్షాకాలం మొదలుకుని ఆరు నెలల పాటు పర్యాటకులను కనువిందు చేస్తుంది.

ప్రకృతి అందాలకు దాసోహం

మర్రిగూడ మండల కేంద్రం నుంచి 10కిలోమీటర్ల దూరంలో ఈ బుగ్గ ఉంది. ఈ ప్రాంతమంతా కొండలు, లోయలు, పచ్చనిచెట్లతో కూడుకుని ఉంటుంది. వరద నీరంతా ఒకేచోట చేరి కొండపై నుంచి కిందకు దూకుతూ జలపాతాన్ని తలపిస్తుంటుంది. గత ఐదు రోజులుగా నీటి ప్రవాహం వస్తుండడంతో యువకులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఇక్కడకు చేరుకుని సందడి చేస్తుంటారు.

గుహ మధ్యలో వెలసిన శివలింగం

మర్రిగూడ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల నుంచి కూడా నిత్యం వందల సంఖ్యలో జలపాతం వస్తున్న సమయంలో వచ్చి వెళ్తుంటారు. యువత ఇక్కడ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకుంటారు. ఈ జలపాతం దగ్గరకు వెళ్లాలంటే అజ్జలాపురం గ్రామం నుంచి సుమారు 2కి.మీ మేరకు కాలినడక ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కాలినడకన వెళ్లే మార్గంలో వివిధ పక్షుల రాగాలు కాలినడక అలసటను మైమరపింపజేస్తాయి. ఈ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉంటుంది. ఇక్కడ కొండల నడుమ గుహ మధ్యలో శివలింగం కూడా వెలిసింది. ఈ ప్రాంతానికి వచ్చేవారు స్వామివారి దర్శనం చేసుకుంటారు. ఇక్కడ పెద్దఎత్తున మొగలి చెట్లు ఉండడంతో ఈ ప్రాంతమంతా మొగలి పూల సువాసన వెదజల్లుతుంది.

శివారెడ్డిగూడెంలో 'కృష్ణ ఫ్రమ్ బృందావనం కాలనీ'

భూదాన్‌పోచంపల్లి: భూదాన్ పోచంపల్లి మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామ శివారులో బుధవారం 'కృష్ణ ఫ్రమ్ బృందావనం కాలనీ' సినిమా షూటింగ్ నిర్వహించారు. హీరో ఆది సాయికుమార్, పలువురు జూనియర్ ఆర్టిస్టులతో పలు సన్నివేశాలు చిత్రీకరించినట్లు దర్శకుడు వీరభద్రం చౌదరి తెలిపారు.



చిత్రీకరణలో హీరో ఆది సాయికుమార్, జూనియర్ ఆర్టిస్టులు

అబ్దుల్ కలాం స్ఫూర్తితో చదవాలి



విద్యార్థులకు గోల్డ్‌మెడల్ ప్రదానం చేస్తున్న తెలుగు ప్రొఫెసర్ రాములు

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ రాములు

నకిరేకల్: విద్యార్థులు అబ్దుల్ కలాం స్ఫూర్తితో చదవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు అన్నారు. నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రపంచ విద్యార్థుల దినోత్సవం, గోల్డ్‌మెడల్ ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉన్నతమైన కళ, జ్ఞాన సముపార్జన, నిరంతరం శ్రమ, పట్టుదల ఈ నాలుగు నియమాలు అనుసరిస్తే ప్రతి విద్యార్థి అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాజధానిలోని కళాశాలలతో పోటీ పడుతుండడం అభినందనీయమన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు కళాశాలలో దాతల సహకారంతో మూడు గోల్డ్ మోడల్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నల్లగొండ ఎన్జీ కళాశాల, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు ఎస్.ఉపేందర్, రహత్ ఖానం, ప్రోగాం కన్వీనర్ శ్రీనివాసాచారి, వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిత, మధుసూదన్‌రెడ్డి, శంకర్, రవీందర్, నర్సింహాచారి, శివశంకర్ పాల్గొన్నారు.

25లోగా సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించాలి

నల్లగొండ టూటౌన్: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ అభ్యసిస్తున్న 1, 3, 5 సెమిస్టర్లకు చెందిన విద్యార్థులు ఈ నెల 25లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ఎంజీ యూనివర్సిటీ సీఓఈ ఉపేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 ఆలస్య రుసుముతో ఈనెల 27లోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

పరిశోధనలే సమాజానికి దిక్సూచి

- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: పరిశోధనలే సమాజానికి దిక్సూచి అని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. నల్లగొండలోని ఎంజీ యూనివర్సిటీలో ఐక్యూ ఏసీ ఆధ్వర్యంలో 2028లో జరగనున్న మూడవ విడత నాక్ మూల్యాంకనంపై బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. అధ్యాపకులు పరిశోధనలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి అధ్యాపకుడు విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించాలన్నారు. నాక్ ఏ గ్రేడ్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో గోపికృష్ణ, గోనారెడ్డి, అల్వాల రవి, మిరియాల రమేష్, కొప్పుల అంజిరెడ్డి, రేఖ, అన్నపూర్ణ, ఆకుల రవి, సుధారాణి, శ్రీదేవి, అరుణప్రియ పాల్గొన్నారు.

రాష్ట్ర హక్కులను కాపాడుతాం

- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

కోదాడ: కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర హక్కులను కాపాడేందుకు ఎంత వరకైనా వెళ్తామని ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కోదాడలో విలేకరులతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్ట్‌ను ప్రతిపాదిస్తున్నదని తెలుసుకున్న వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర జలవనరులశాఖకు, కేంద్ర ప్రభుత్వానికి తమ వ్యతిరేకతను తెలియజేశామని అన్నారు. రాష్ట్ర నీటిపారుదశాఖ మంత్రి హోదాలో తాను న్యాయస్థానంలో హాజరయ్యానని తెలిపారు. ప్రజల్లో అపోహలు కలిగించడానికి ప్రతిపక్షనేతలు అసత్య ప్రచారాలను చేస్తున్నారని ఆరోపించారు. కృష్ణా జలాల విషయంలో గత ప్రభుత్వం 811 టీఎంసీలలో 299 టీఎంసీలు తెలంగాణకు సరిపోతాయని ఒప్పుకుందన్నారు. తమ ప్రభుత్వం 811 టీఎంసీలలో తెలంగాణకు 70శాతం నీటివాటా కావాలని పోరాడుతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని అందిస్తామని దీనికి ఇప్పటికే రూ.4300 కోట్లు కేటాయించామని తెలిపారు. సొరంగం తవ్వకంలో ప్రమాదం జరిగి పనులు ఆగిపోయాయని, దేశంలోనే ఉత్తమ సొరంగ నిపుణులను తీసుకొచ్చి పనులను ప్రారంభించడానికి కృషి చేస్తున్నామన్నారు. డిండి ప్రాజెక్ట్‌కు రూ.1800 కోట్లను కేటాయించి పనులు చేయబోతున్నామని తెలిపారు. గోదావరి జలాలను శ్రీరాంసాగర్ ఫేజ్–2 ద్వారా సూర్యాపేట జిల్లాకు తీసుకొస్తామని తెలిపారు. ఈ సంవత్సరం వానాకాలంలో రాష్ట్రంలో 67 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారని, 148. 8 లక్షల టన్నుల ధ్యానం పండబోతున్నదని, దీనిలో 87 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని వివరించారు. దీని కోసం 8432 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటిలో అన్ని సౌకర్యాలను కల్పించామని తెలిపారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సంతకాలు చేసిన ప్రతులను చూపుతున్న ఎంపీ చామల కిరణ్, ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: దొంగ ఓట్లను సృష్టించి అధికారంలోకి రావడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ దోపిడీకి పాల్పడుతుందని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'రైజ్ యువర్ వాయిస్' అనే నినాదంతో 'ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీకి మద్దతుగా దేశం బాగు కోసం మా సంతకం' అనే కార్యక్రమాన్ని బుధవారం శాలిగౌరారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారం కోసం ప్రజల రాజ్యాంగ హక్కులను హరిస్తూ ఓట్ల దొంగతనానికి పాల్పడుతుందని విమర్శించారు. అనేక రాష్ట్రాల్లో ఓట్లచోరీతో అధికారం చేపట్టిన బీజేపీ ఇప్పుడు బిహార్‌లోనూ అదేవిధంగా కార్యాచరణ చేపట్టిందన్నారు. ఓట్లచోరీకి వ్యతిరేకంగా జరిగే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తనకు ఓటుహక్కు కలిగి ఉన్న సొంత గ్రామంలోని అదే బూత్ పరిధిలో సంతకాల సేకరణ ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, పీసీసీ మాజీ అధికార ప్రతినిధి నూక కిరణ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, గంట్ల వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి గూని వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు ఎర్ర చైతన్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేశ్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రులకు రైతుల బాధలు పట్టడం లేదు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రామన్నపేట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న చిరుమర్తి లింగయ్య

రామన్నపేట: సీఎం, మంత్రులకు రాజకీయాలు తప్ప.. రైతుల బాధలు పట్టడం లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు దళారులకు అమ్మి నష్టపోతున్నారన్నారు. మంత్రుల మధ్య సమన్వయలోపం ప్రజలకు శాపంగా మారిందన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా యుద్ధప్రాతిపదికన ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్ నాయకులు బందెల రాములు, వేమవరపు సుధీర్‌బాబు, గొరిగె నర్సింహ, బద్దుల ఉమారమేష్, సాల్వేరు అశోక్, ఎస్‌కే చాంద్, మిర్యాల మల్లేశం, జాడ సంతోష్, బొడ్డు అల్లయ్య, లవనం రాము, దండుగుల సమ్మయ్య, ఎండీ ఎజాజ్, ఆవుల శ్రీధర్, గర్దాసు విక్రం, రాస వెంకటేశ్వర్లు, బుర్ర శ్రీశైలం, ఎండీ మొసబ్, సైదులు, ఎండీ అంజద్, బాబు, నరేష్, గణేష్, ఖలీం, యాదయ్య, లింగయ్య ఉన్నారు.

శ్రీగంధం చెట్లను నరికి చోరీకి పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

- 11 శ్రీగంధం దుంగలు, మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, ఫెన్సింగ్ వైర్ కట్టర్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: రైతులు తోటల్లో పెంచుతున్న శ్రీగంధం చెట్లను నరికి చోరీకి పాల్పడుతున్న ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. కేసు వివరాలను బుధవారం నల్లగొండలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన వెల్లడించారు. బుధవారం ఉదయం కనగల్ సమీపంలో రెండు బైక్‌లపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి అక్కడి నుంచి పరారయ్యేందుకు యత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా వారి వద్ద చెట్లు నరికే పరికరాలను గుర్తించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గందిగామ్ గ్రామానికి చెందిన దివానా, అరుద్యా గ్రామానికి చెందిన దద్దసింగ్, సుగువా గ్రామానికి చెందిన మజాన్‌లుగా గుర్తించారు. వీరి వద్ద 11 శ్రీగంధం మొద్దులు (దుంగలు), మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, మూడు రంపాలు, రెండు గొడ్డళ్లు, ఫెన్సింగ్ వైర్ కట్టర్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన మరో ముగ్గురు నిందితులు అన్నాబౌ లక్ష్మణ్ గైక్వాడ్, జవాస్, అజుబాలు పరారీలో ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, వెంకన్న, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికను వేధించిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): బాలికను వేధించిన వ్యక్తికి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి రోజారమణి బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన ఉప్పుల నాగార్జున 2019లో వివాహ శుభకార్యానికి వెళ్లాడు. అక్కడ ఆడుకుంటున్న బాలికను పిలిచి లైంగికంగా వేధిస్తుండగా కుటుంబ సభ్యులు చూసేసరికి అక్కడి నుంచి పారిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేతేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి నిందితుడికి మూడు సెక్షన్‌ల కింద ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. బాధిత కుటుంబానికి రూ.7లక్షల పరిహారం చెల్లించాలని సూచించారు. కోర్టుకు సాక్ష్యాధారాలు సమర్పించడంలో లైజన్ అధికారులు నరేందర్, మల్లికార్జున్, కోర్టు కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ సహకరించారు.

ఒక్కో వాహనం చోరీకి ఏడాది చొప్పున..

నిడమనూరు : మూడు ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన ఘటనలో ఒక్కో వాహనానికి గాను ఏడాది చొప్పున మొత్తం మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పునిచ్చింది. నల్లగొండ జిల్లా అనుముల మండలంలోని అలీనగర్‌కు చెందిన మహ్మద్ జాని ఈ ఏడాది జూన్ 19న, జూలై 12, 16, 25 తేదీల్లో హాలియా బస్టాండ్‌లో నిలిపిన నాలుగు ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. బాధితులు గాయం శంకర్, లింగంపల్లి సత్యనారాయణ, గొర్ల సైదయ్య, కున్‌రెడ్డి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయి ప్రశాంత్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోలీసులు నిందితుడిపై సరైన సాక్ష్యాధారాలు సమర్పించారు. ఈమేరకు నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వప్న సాక్షులను విచారించి నిందితుడికి ఒక్కో వాహనం చోరీకిగాను ఏడాది చొప్పున మూడు వాహనాలకు మూడేళ్ల జైలు శిక్ష విధించారు. నాలుగో వాహనం చోరీ కేసులో రెండు నెలల 10 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సాధన వాదనలు వినిపించారు.

రైలు నుంచి పడి తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

గరిడేపల్లి: మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కీత వెంకటేశ్వర్లు బుధవారం వ్యక్తిగత పనులపై ఢిల్లీ వెళ్తుండగా మార్గమధ్యలో జార్ఖండ్ రాష్ట్రంలోని కడారు ప్రాంతంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఈ ప్రాంతం నుంచి చురుకైన పాత్ర పోషించారు. వెంకటేశ్వర్లు మృతి పట్ల మండల బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మునగాల: మండలంలోని ఆకుపాముల శివారులో జాతీయ రహదారిపై బుధవారం గుర్తు తెలియని కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కోదండరామాపురం గ్రామానికి చెందిన రెణబోతు అప్పిరెడ్డి, రెణబోతు లక్ష్మీనరసింహారెడ్డి ఇద్దరు సోదరులు. లక్ష్మీనరసింహారెడ్డికి చెందిన ద్విచక్రవాహనంపై అప్పిరెడ్డితో కలిసి కోదాడ మండలం కందిబండ గణపవరం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యంలో ఆకుపాముల వద్ద విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే కారు అతివేగంగా వచ్చి వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. గాయపడిన వీరిద్దరిని స్థానికులు చికిత్స నిమిత్తం కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వారి కుటుంబసభ్యులు కోదాడకు చేరుకొని మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

భూ నిర్వాసితులకు రాచకొండలో భూములివ్వాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



చౌటుప్పల్ : జంక్షన్ ప్రాంతంలోని భూములను పరిశీలిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులకు పరిహారంగా రాచకొండలోని భూములు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌లో నిర్మించనున్న ట్రిపుల్‌ఆర్ జంక్షన్ ప్రాంతాన్ని బుధవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి సందర్శించారు. రీజినల్ రింగ్‌రోడ్డు కోసం గుర్తించిన పొలాలు, వెంచర్లను పరిశీలించారు. భూనిర్వాసితులను కలిసి వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివీస్, శ్రీని పరిశ్రమలను కాపాడేందుకు అలైన్‌మెంట్‌ను చౌటుప్పల్ ప్రాంతంలో 10కిలోమీటర్లు వంకర్లుగా మార్చారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తక్షణమే చౌటుప్పల్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, సహాయకార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి, బచ్చనగోని గాలయ్య, నిర్వాసితులు బోరెం ప్రకాష్‌రెడ్డి, వల్లూరి బోవయ్య, సందగళ్ల మల్లేష్, జాల శ్రీశైలం పాల్గొన్నారు.

భూనిర్వాసితుల మద్దతుకు సీపీఐ ఉద్యమిస్తుంది

సంస్థాన్ నారాయణపురం: రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ వారికి మద్దతుగా సీపీఐ ఉద్యమిస్తుందని ఆపార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తున్న దేవిరెడ్డిబంగ్లా, పుట్టపాక గ్రామాల్లో పర్యటించి పొలాలు పరిశీలించారు. ఉత్తర భాగం విషయమై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలుస్తామన్నారు. దక్షిణ భాగం భూనిర్వాసితులతో ప్రభుత్వ పెద్దలను కలుస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామెదర్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణరావు, నాయకులు తదితరులున్నారు.


బైక్‌ల చోరీ ముఠా అరెస్ట్



నిందితులను చూపుతున్న పట్టణ ఇన్‌స్పెక్టర్

భువనగిరిటౌన్ : బైక్‌ల చోరీ ముఠాను భువనగిరి పట్టణ పోలీసులు పట్టుకున్నారు. కేసు వివరాలను బుధవారం భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని యాకుత్‌పుర చెందిన సయ్యద్ తలీబ్ అలియాస్ సమీక్(ఏ1) అలూబా(ఎ2), రేహన్ (ఏ3), ఎండీ సాజిద్(ఏ4)తోపాటు వికారాబాద్ జిల్లా పూడూరు మండలం గోమల్ గ్రామానికి చెందిన మహ్మద్ షోయబ్ అలియాస్ శ్రీనివాస్(ఏ5) ముఠాగా ఏర్పడ్డారు. ప్రధాన నిందితుడు సయ్యద్ తలీబ్ గతంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి ఆగస్టులో బెయిల్‌పై విడుదలయ్యాడు. అతడికి పరిచయమున్న అలూబా, రేహన్, సాజిద్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈ నలుగురు కలిసి ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసి ఉన్న బైక్‌లను చోరీ చేసి వికారాబాద్ జిల్లాకు చెందిన షోయబ్‌కు ఇచ్చేవారు. అతడు తనకు తెలిసిన వాళ్లకు విక్రయించేవాడు. ఇలా వచ్చిన డబ్బును ఐదుగురు కలిసి సమాన వాటాగా పంచుకునేవారు. ఈనెల 6వ తేదీన భువనగిరిలో జరిగిన ద్విచక్రవాహనం చోరీ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను సీసీ కెమెరాలో గుర్తించారు. ఈమేరకు హైదరాబాద్‌లో సయ్యద్ తలీబ్, సాజిద్, మహ్మద్ షోయబ్‌ను అరెస్ట్ చేసి భువనగిరి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మిగతా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. పట్టుబడ్డ నిందితుల వద్ద రూ.4.80లక్షల విలువైన ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సైలు రమేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తరలిన ఉమ్మడి జిల్లా జట్టు



ఉమ్మడి జిల్లా వాలీబాల్ క్రీడాకారుల జట్టు

భువనగిరి: హైదరాబాద్‌లోని పటాన్‌చెర్వులో ఈ నెల 16, 17, 18న జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు బుధవారం ఉమ్మడి జిల్లా బాలుర జట్టు బుధవారం భువనగిరి నుంచి బయలుదేరింది. డీఈఓ సత్యనారాయణ వారికి అభినందనలు తెలిపారు.

స్కూటీపై లిఫ్ట్ ఇచ్చి.. మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

శాలిగౌరారం: పొలం వద్దకు రోడ్డువెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళకు తన బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి మార్గమధ్యంలో ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును దుండగుడు లాక్కెళ్లాడు. ఈ సంఘటన శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్–ఓగోడు రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన ఆవుల సావిత్రమ్మ(55) మాధారంకలాన్ శివారులో తన వ్యవసాయ పొలానికి నడుచుకుంటూ వెళ్తోంది. మాధారంకలాన్ వైపు స్కూటీపై వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి సావిత్రమ్మను చూసి వాహనాన్ని ఆపాడు. తాను కూడా మాధారం కలాన్ వెళ్తున్నానని చెప్పి ఆమెను స్కూటీపై ఎక్కించుకున్నాడు. చౌళ్లగూడెం వద్ద గల 365వ నంబర్ జాతీయ రహదారి జంక్షన్ సమీపంలోకి రాగానే స్కూటీని ఆపాడు. వాహనం దిగిన సావిత్రమ్మ నడుచుకుంటూ జంక్షన్ వైపు వస్తుండగా వెనుక నుంచి వచ్చి ఇనుపరాడ్‌తో సావిత్రమ్మ తలపై బలంగా కొట్టాడు. ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కొని స్కూటీపై పరారయ్యాడు. కొద్దిసేపటి తర్వాత షాక్ నుంచి తేరుకున్న సావిత్రమ్మ తన కుమారుడు సైదులుకు ఫోన్‌చేసి జరిగిన విషయాన్ని చెప్పింది. అతడు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని తల్లిని నకిరేకల్‌లోని ఆస్పత్రికి తరలించాడు. సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీలక్ష్మీనారసింహుడి నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నిత్యారాధనలో భాగంగా స్వామి, అమ్మవారి నిత్యకల్యాణాన్ని అర్చకులు ఆగమశాస్త్రానుసారం నేత్రపర్వంగా చేపట్టారు. బుధవారం వేకువజామున ఆలయాన్ని తెరచిన అర్చ కులు స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాతం సేవ చేపట్టి, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం వేడుక జరిపించారు. బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సు వర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూ జలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం గావించారు.